కుండపోత



బాలచెరువు వంతెన పక్కన నిలిచిన నీరు

లోతట్టు ప్రాంతాలు జలమయం



వర్షం నీటితో పొంగి ప్రవహిస్తున్న నడుపూరు గెడ్డ

పెదగంట్యాడ: మండలంలో మంగళవారం మధ్యాహ్నం కుండపోతగా వాన కురిసింది. రెండుగంటల పాటు భారీ వర్షం పడడంతో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. కాలువలు, గెడ్డలు పొంగిపొర్లాయి. రోడ్లన్నీ వర్షపు నీటితో నిండిపోయి చెరువులను తలపించాయి. మండలంలోని నడుపూరు, రామచంద్రనగర్, గాంధీనగర్, స్వతంత్రనగర్, బర్మా కాలనీ, హౌసింగ్ బోర్డు కాలనీ తదితర ప్రాంతాల్లోని రోడ్లపై నీరు ఎక్కడికక్కడే నిలిచిపోయింది. దీంతో వాహనచోదకులు, పాదచారులు రాకపోకలకు అవస్థలు పడ్డారు.

భారీ వర్షంతో రహదారులు జలమయం

గాజువాక: భారీ వర్షానికి గాజువాకలోని పలు రహదారులు జలమయమయ్యాయి. నిత్యం రద్దీగా ఉండే పాతగాజువాక జంక్షన్ జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న సర్వీసు రోడ్డు చెరువును తలపించింది. మోకాళ్లలోతు నీరు నిలిచిపోవడంతో సర్వీసు రోడ్‌లోని వాహనాలు మునిగిపోయాయి. పంతులుగారి మేడ, కణితి రోడ్, సినిమా హాల్ జంక్షన్ వద్ద మెయిన్ రోడ్, చినగంట్యాడ వందడుగుల రోడ్, శ్రీనగర్ ఫ్లైఓవర్ వద్ద నీరు భారీగా నిలిచిపోయింది.



పంతులుగారి మేడవద్ద సర్వీస్ రోడ్‌లో ..



పాతగాజువాక జంక్షన్‌లోని సర్వీస్ రోడ్డులో..

'జగనన్న సురక్ష'తో అర్హులకు మేలు



జగనన్న సురక్ష కార్యక్రమంలో మహిళకు ధ్రువపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

పెదగంట్యాడ: అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సేవలు, సంక్షేమ ఫలాలు అందాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. అందుకోసమే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశ పెట్టారన్నారు. జీవీఎంసీ 76వ వార్డు నడుపూరు సచివాలయ ఆవరణలో మంగళవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జగనన్న సురక్ష ద్వారా ప్రజలు తమకు అవసరమైన 11 రకాల సర్టిఫికెట్ల కోసం అధికారులు, కార్యాలయాల చుట్టూ తిరిగే పనిలేకుండా ఈ కార్యక్రమం ద్వారా ఇంటి వద్దే ఉచితంగా ధ్రువ పత్రాలు అందుకునే వెసులుబాటు ప్రభు త్వం కల్పించిందన్నారు. గత ప్రభుత్వ హయాంలో జన్మభూమి కమిటీల ద్వారా ప్రజలను దోచుకున్నారని, నెలలు తరబడి తిప్పుతూ వారి వద్ద డబ్బులు వసూలు చేసేవారని విమర్శించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక ఇప్పుడు ప్రజల చెంతకే ప్రభుత్వ సేవలు అందుతున్నాయన్నారు. అనంతరం ఇంటింటి సర్వే ద్వారా దరఖాస్తు చేసుకున్న 1138 మందికి వివిధ రకాల సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ పి.సింహాచలం, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, పార్టీ వార్డు అధ్యక్షుడు దొడ్డి రమణ, 64వ వార్డు అధ్యక్షుడు ధర్మాల శ్రీనివాసరావు, మండల క్లస్టర్ ఇన్‌చార్జి కలుకూరి మంగరాజు, ఏపీడీ రాము, వార్డు నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



హాజరైన ప్రజలు

క్లుప్తంగా

ఘనంగా మహాగణపతి ఆలయ వార్షికోత్సవం



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

అగనంపూడి: జీవీఎంసీ 79వ వార్డు అగనంపూడి అన్నపూర్ణ నగర్‌లోని మహాగణపతి ఆలయ 15వ వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా జరిపించారు. ముందుగా మహాగణపతికి విశేష పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ జి.పూర్ణానంద శర్మ, నాయకులు గుర్రం శ్రీను, జెర్రిపోతుల సోమునాయుడు, మామిడి శ్రీను, ఆలయ కమిటీ ప్రతినిధులు మాడిశ వెంకటరావు, సునపర్తి చంటిబాబు తదితరులు పాల్గొన్నారు.

వర్షంతో చెరువు సర్వే వాయిదా



నాతయ్యపాలెంలో కృష్ణమహంతి చెరువు సర్వే పనుల్లో సర్వేయర్లు, సిబ్బంది

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 69వ వార్డు నాతయ్యపాలెంలోని కృష్ణమహంతి చెరువు సర్వే పనులు వర్షం కారణంగా నిలిచిపోయాయి. నిబంధనల ప్రకారం ఆక్రమణలు గుర్తించిన అనంతరం చెరువు అభివృద్ధి పనులు చేపట్టాలి. దీంతో ముందుగా చెరువు సర్వే నిర్వహించేందుకు ఉపక్రమించారు. మండల సర్వేయర్, టౌన్ ప్లానింగ్ సర్వేయర్లు సిబ్బందితో కలిసి మంగళవారం కృష్ణమహంతి చెరువు సర్వే చేసేందుకు సన్నద్ధమయ్యారు. కానీ వర్షాల కారణంగా వాతావరణం అనుకూలించకపోవడంతో వెనుదిరిగారని కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి తెలిపారు.


కుంచుమాంబ సన్నిధిలో అన్న సమారాధన



భక్తులకు అన్నప్రసాదం వడ్డిస్తున్న గురుమూర్తి రెడ్డి ,పెదరెడ్డి తదితరులు

పెదగంట్యాడ: జీవీఎంసీ 75వ వార్డు పెదగంట్యాడ నీలాపు వీధిలో గ్రామ దేవత కుంచుమాంబ ఆలయ సన్నిధిలో ఆలయ ధర్మకర్తలు మాజీ ఎమ్మెల్యే తిప్పల గురుమూర్తి రెడ్డి, విజయకుమారి ఆధ్వర్యంలో మంగళవారం అన్న సమారాధన నిర్వహించారు. గొందేశి పెదరెడ్డి, అనూరాధ, యశ్వంత్, అనూష సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. మూడు నెలలుగా ప్రతీ మంగళవారం ప్రత్యేక పూజలు, అన్నసమారాధన నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో తీగల సరోజినీ, నానాజీ, అప్పలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ లేబర్ డాష్‌బోర్డు ప్రారంభం



డాష్ బోర్డును ప్రారంభిస్తున్న స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ పాండే

ఉక్కునగరం: కాంట్రాక్టు కార్మికుల డాష్ బోర్డు ను స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ (పర్సనల్) డాక్టర్ సురేష్‌చంద్ర పాండే ప్రారంభించారు. హెచ్‌ఆర్ డిజిటలైజేషన్ ట్రాన్స్‌ఫర్మేషన్ కార్యక్రమంలో భాగంగా డాష్‌బోర్డును ఐటీ అండ్ ఈఆర్‌పీ సిబ్బంది సహకారంతో హెచ్‌ఆర్ విభాగం సిబ్బంది అభివృద్ధి చేశారు. స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికులకు చెందిన పూర్తి వివరాలతో కూడిన డాష్ బోర్డు హెచ్‌ఆర్, ఉన్నత యాజమాన్యానికి ఎంతో ఉపయుక్తం కానుంది. హెచ్‌ఆర్ సీజీఎం జి.గాంధీతో పాటు హెచ్‌ఆర్, ఐటీఅండ్‌ఈఆర్‌పీ అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వరంగ సంస్థలతోనే దేశాభివృద్ధి



దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: ప్రభుత్వరంగ సంస్థలతోనే దేశాభివృద్ధి సాధ్యమని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇష్టానుసారం ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేట్ వ్యక్తులకు అమ్ముకుంటూ పోవడం సరికాదన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్షల్లో 894వ రోజు మంగళవారం, సంస్థకు చెందిన పలువురు కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్‌ను 100 శాతం అమ్మాలనే నిర్ణయాన్ని తక్షణమే విరమించుకోవాలన్నారు. ప్రైవేటీకరణతో కార్మికులకు నష్టం కలుగుతుందన్నారు. కార్మికులను విస్మరించిన ఏ ప్రభుత్వం బాగుపడలేదన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగిస్తామని ప్రధాని స్పష్టమైన ప్రకటను చేయాలని, లేనిపక్షంలో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

కార్మికులకు క్లస్టర్ పదోన్నతులు కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న స్టీల్ ఇంటక్ ప్రధాన కార్యదర్శి రాజశేఖర్

ఉక్కునగరం: 2008–09 బ్యాచ్‌కు చెందిన కార్మికులకు క్లస్టర్ టెస్టులు నిర్వహించి పదోన్నతులు కల్పించాలని స్టీల్ ఇంటక్ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్ డిమాండ్ చేశారు. సెంట్రల్ స్టోర్స్ యూనియన్ పాయింట్ వద్ద మంగళవారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2022, 2023 సంవత్సరాల నాటికి 900 మంది ఎస్–6కు వచ్చారన్నారు. గతంలో తమ హయాంలో కార్మికులు అధికారులుగా పదోన్నతి పొందారని, ప్రస్తుతం గుర్తింపు సంఘాలు కార్మికుల పదోన్నతుల గురించి పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో అధ్యక్షుడు నీరుకొండ రామచంద్రరావు, కారు రమణ, గొందేశి ప్రభాకరరెడ్డి, ఎస్.ఎ.నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మొక్కలతో పర్యావరణ పరిరక్షణ



పార్కులో మొక్కలు నాటుతున్న తిరుమల నగర్ అసోసియేషన్ ప్రతినిధులు

కూర్మన్నపాలెం: పచ్చదనం పెంచేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని తిరుమల నగర్ అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. ఎకో వైజాగ్ కార్యక్రమంలో 87వ వార్డు తిరుమలనగర్ చిల్డ్రన్స్ పార్కులో మంగళవారం పూలమొక్కలు నాటారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతీ ఒక్కరు మొక్కలు నాటి, వాటిని సంరక్షించే బాధ్యతను కూడా తీసుకోవాలన్నారు. జీవ వైవిధ్యాన్ని కాపాడడంలో మొక్కలు ప్రముఖ పాత్ర పోషిస్తాయన్నారు. భావితరాలకు ఆహ్లాదకర వాతావరణాన్ని అందించేందుకు ప్రతీ ఒక్కరు మొక్కలు నాటాలని, అలాగే పిల్లలకు కూడా పచ్చదనం పెంపుపై అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో తిరుమలనగర్ అసోసియేషన్ ప్రతినిధులు నాగభూషణం, విశ్వేశ్వరరావు, పరమానందం, భాస్కరరావు, సన్యాసిరావు, వసంతరెడ్డి, కాలనీవాసులు, మహిళలు పాల్గొన్నారు.

మణిపూర్‌లో మారణ హోమాన్ని ఆపాలి



ధర్నాలో మాట్లాడుతున్న సీఐటీయూ ప్రధాన కార్యదర్శి రామస్వామి

ఉక్కునగరం: మణిపూర్ రాష్ట్రంలో జరుగుతున్న మారణ హోమాన్ని తక్షణం ఆపే విధంగా చర్యలు తీసుకోవాలని స్టీల్ సీఐటీయూ ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి డిమాండ్ చేశారు. మణిపూర్ అమానుషంపై ఉక్కు ఎల్‌డీసీ విభాగం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ గతంలో గుజరాత్‌లో జరిగిన అల్లర్ల మాదిరిగానే మణిపూర్‌లోనూ ఒక తెగ మరొక తెగపై దాడులకు తెగబడుతూ మారణ హోమాన్ని సృష్టిస్తున్నారన్నారు. ఇంతటి దారుణాలు జరుగుతుంటే, శరణార్థ శిబిరాల్లో ఆహారాన్ని కూడా ఎత్తుకుపోతుంటే ప్రధాని విదేశీ పర్యటనలు చేసుకుంటున్నారని విమర్శించారు. ఇలాంటి సంఘటనలు జరగకుండా కేంద్ర ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు బి.అప్పారావు, మహేష్, వి.వి.రమణ తదితరులు పాల్గొన్నారు.

'విశాఖ-నర్సాపురం' రైలు పునరుద్ధరణకు వినతి

అగనంపూడి: విశాఖపట్నం నుంచి నర్సాపురం వరకు గతంలో నడిపిన ఫాస్ట్ పాసింజర్ రైలును పునరుద్ధరించాలని దువ్వాడ రైల్వేస్టేషన్ యూజర్స్ అసోసియేషన్ కార్యదర్శి కె.ఈశ్వర్ రైల్వే జీఎం, డీఆర్ఎం, ఎంపీ జీవీఎల్ నరసింహారావును ట్విటర్‌లో కోరారు. విశాఖ నుంచి నేరుగా నర్సాపురానికి నడిపే సింహాద్రి ఎక్స్‌ప్రెస్‌ను ఇప్పటికే తొలగించారని పేర్కొన్నారు. విశాఖ, నర్సాపురం మధ్య నడిచే ఫాస్ట్ పాసింజర్‌ను కరోనా సమయంలో రద్దు చేశారని, ఈ రెండు రైళ్ల వల్ల విశాఖ నుంచి ఉభయ గోదావరి జిల్లాలకు రాకపోకలకు అనువుగా ఉండేవని పేర్కొన్నారు. విశాఖలోని స్టీల్‌ప్లాంట్, వీపీటీ, బీహెచ్ఈఎల్, ఫార్మా, వీఎస్ఈజెడ్, ఎన్టీపీసీ, హెచ్‌పీసీఎల్‌లో వేలాది మంది ఉద్యోగులు ఉభయ గోదావరి జిల్లాల నుంచి వచ్చి ఇక్కడ స్థిరపడ్డారని, వారు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు.

22వ రోజుకు గంగవరం పోర్టు కార్మికుల దీక్షలు



దీక్ష శిబిరంలో కార్మికులు

పెదగంట్యాడ: అదానీ గంగవరం పోర్టులో పని చేస్తున్న నిర్వాసిత కార్మికులకు న్యాయం చేయాలని గంగవరం పోర్టు ఎంప్లాయీస్ యూనియన్ ఉపాధ్యక్షుడు కొవిరి అప్పలరాజు డిమాండ్ చేశారు. గంగవరం పోర్టు ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో పోర్టు వంతెన వద్ద చేపట్టిన నిరవధిక నిరసన దీక్షలు మంగళవారానికి 22వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో పాల్గొన్న అప్పలరాజు మాట్లాడుతూ గంగవరం పోర్టు నిర్మాణం కోసం భూములు త్యాగం చేసిన వారికి అన్యాయం చేయడం సరికాదన్నారు. జీతాలు పెంచమని కోరిన కార్మికులను ఉద్యోగాల నుంచి ఎలా తొలగిస్తారని ప్రశ్నించారు. వెంటనే వారిని విధుల్లోకి తీసుకోవాలని కోరారు. ఇప్పటికైనా యాజమాన్యం దిగి వచ్చి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వాసుపల్లి ఎల్లాజీ, కొవిరి అమ్మోరు, రాజారావు తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితాల పరిశీలనపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న ఈఆర్వో లక్ష్మారెడ్డి

గాజువాక: ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను పరిశీలించడంపై ఎన్నికల నమోదు అధికారులు రాజకీయ పార్టీల నాయకులకు అవగాహన కల్పించారు. జీవీఎంసీ గాజువాక జోనల్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఎన్నికల నమోదు అధికారి డి.లక్ష్మారెడ్డి మాట్లాడారు. వివిధ అంశాలపై నాయకులు అడిగిన సందేహాలకు సమాధానమిచ్చారు. ఇప్పటికే ఇంటింటికీ వెళ్లి పరిశీలించిన ఓటర్లలో తొలగించాల్సిన ఓటర్లను గుర్తించామని పేర్కొన్నారు. వాటి జాబితాలను నాయకులకు అందజేశారు. ఆ జాబితాలను పరిశీలించి అభ్యంతరాలను తెలపాలని కోరారు. నియోజకవర్గంలోని 305 పోలింగ్ కేంద్రాల్లో నియమితులైన బూత్ లెవల్ ఆఫీసర్ల వివరాలు, వారి ఫోన్ నంబర్లతో కూడిన జాబితాలను వారికి అందజేశారు. కార్యక్రమంలో గాజువాక, పెదగంట్యాడ తహసీల్దార్లు ఎం.పాల్ కిరణ్, రమాదేవి, డిప్యూటీ తహసీల్దార్లు కె.త్రినాథరావు, డి.ధర్మరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు పరిరక్షణ ఉద్యమానికి 'ఆప్' సంఘీభావం



సంఘీభావ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అయోధ్యరామ్, ఆప్ నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ వ్యతిరేక పోరాటానికి ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) సంఘీభావం తెలిపింది. ఆప్ నాయకులు ఉక్కు ఎల్‌డీసీ వద్ద మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో స్టీల్ సీఐటీయూ అధ్యక్షుడు జె. అయోధ్యరామ్ చేతుల మీదుగా సంఘీభావ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆప్ నాయకులు డాక్టర్ శీతల్ మాట్లాడుతూ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఆప్ తీవ్రంగా వ్యతిరేకిస్తోందన్నారు. ఈ అంశంపై ఆప్ తరపున తాము చలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఢిల్లీలో ఆప్ అధిష్టానాన్ని కలిసి, ప్రైవేటీకరణ అంశంపై పార్లమెంట్‌లో మరింతగా గళమెత్తాలని కోరనున్నామన్నారు. స్టీల్ సీఐటీయూ గౌరవాధ్యక్షుడు అయోధ్యరామ్ మాట్లాడుతూ ఆప్ ఎంపీ సంజయ్ సింగ్ ఇప్పటికే పార్లమెంట్‌లో ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడుతున్నారన్నారు. భవిష్యత్తులోనూ ఇదే విధమైన మద్దతు ఇచ్చేలా ఆప్ నాయకులు తమ అధిష్టానాన్ని కోరాలన్నారు. కార్యక్రమంలో ఆప్ నాయకులు పవన్, సీరా రమేష్, కె.ఎం.రాజు తదితరులు పాల్గొన్నారు.

'ఫరెవర్ మిసెస్ వైజాగ్' విజేతకు అభినందన



దివ్యను అభినందిస్తున్న శిష్టకరణ సంఘం నాయకులు

గాజువాక: త్వరలో నిర్వహించనున్న ఫరెవర్ మిసెస్ ఇండియా 2023 పోటీలకు గాజువాక డ్రైవర్స్ కాలనీకి చెందిన బెహరా దివ్య ఎంపికయ్యారు. ఇటీవల నగరంలో నిర్వహించిన ఫరెవర్ మిసెస్ వైజాగ్ 2023 పోటీల్లో విజేతగా నిలిచిన ఆమెను రాజస్థాన్‌లో నిర్వహించనున్న మిసెస్ ఇండియా పోటీలకు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా గాజువాక శిష్టకరణ సంఘం ప్రతినిధులు ఆమెను అభినందించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్ష కార్యదర్శులు బలివాడ సత్యారావు, బాసంగి తిరుపతిరావు, నాయకులు కె.గౌరీ ప్రసాదరావు, ఎస్.వెంకటేశ్వరరావు పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

నూతన వేతనాల అమలుకు సంతకాల సేకరణ



సంతకాల సేకరణలో పాల్గొన్న కార్మికులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కార్మికులకు నూతన వేతనాలు అమలు చేయాలన్న డిమాండ్‌పై మంగళవారం సంతకాల సేకరణ చేపట్టారు. స్టీల్ సీఐటీయూ ఆధ్వర్యంలో ప్లాంట్‌లోని వివిధ విభాగాల్లో కార్మికులను కలిసి, సంతకాలు సేకరించారు. సెయిల్‌లో 2021లో నూతన వేతనాలు అమలు చేశారన్నారు. 2022 ఫిబ్రవరిలో బోర్డు ఆమోదించి, ఆ ఏడాది మే నెలలో ఉక్కు మంత్రిత్వశాఖ ఆమోదం కోసం పంపినా ఇప్పటికీ స్పందన రాకపోవడం దుర్మార్గమన్నారు. కార్మికుల ఆర్థిక ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని నూతన వేతనాల అమలుకు చర్యలు తీసుకోవాలని కోరారు. సంతకాలను సేకరించి కేంద్ర ఉక్కుమంత్రి జ్యోతిరాదిత్య సింధియాకు పంపనున్నామని సీఐటీయూ నాయకులు జె.అయోధ్యరామ్, యు.రామస్వామి, వై.టి. దాస్ తెలిపారు.

ఆర్టీసీ సమాచారం

దువ్వాడ రైల్వేస్టేషన్ నుంచి ప్రతీ పది నిమిషాలకు బస్సు



దువ్వాడ రైల్వేస్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన ఆర్టీసీ సిటీ బస్సుల రాకపోకల వివరాల బోర్డు

అగనంపూడి: దువ్వాడ రైల్వేస్టేషన్ నుంచి వివిధ ప్రాంతాలకు ప్రతీ పది నిమిషాలకు సిటీ బస్సు సౌకర్యం ఏర్పాటు చేశారు. ఈ మేరకు బస్సుల రాకపోకల వివరాలతో బోర్డులు ఏర్పాటు చేశారు. దువ్వాడ రైల్వేస్టేషన్ నాలుగో నంబర్ ప్లాట్‌ఫాం నుంచి 38వై, 55వై, 55పీ, 311 సిటీ బస్సులు నడుపుతున్నారు. దువ్వాడ రైల్వేస్టేషన్ నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్, సింహాచలం, సబ్బవరం, పెందుర్తి వరకు సిటీ సర్వీసులు నడుస్తున్నాయి.

కోలా గురువులుకు శుభాకాంక్షలు



గురువులును సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

గాజువాక: వైఎస్సార్‌సీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన కోలా గురువులును గాజువాక వైఎస్సార్‌సీపీ నాయకులు అభినందించారు. ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మార్టుపూడి పరదేశి ఆధ్వర్యంలో నాయకులు ఆయన్ను కలిసి పుష్పగుచ్ఛాలను అందజేసి, శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు పిట్టా రెడ్డి, గొందేశి శ్రీనివాస రెడ్డి, ములకలపల్లి వెంకటేష్, మెడికల్ బాబు, గంగులూరి రోజారాణి తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నకు శాస్త్రోక్తంగా నిత్య కల్యాణం



జీలకర్ర బెల్లం ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం నిత్య కల్యాణం శాస్త్రోక్తంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై అధిష్టింపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా సాగింది. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో కళాశాలల బంద్



గాజువాకలో కళాశాలను బంద్ చేయిస్తున్న నాయకులు

గాజువాక: విద్యారంగంలో సమస్యల పరిష్కారం కోరుతూ ఏఐఎస్ఎఫ్ నాయకులు మంగళవారం కళాశాలల బంద్ నిర్వహించారు. ఈ సందర్భంగా గాజువాకలోని పలు కళాశాలలకు వెళ్లి తరగతులను బహిష్కరించారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి యు.నాగరాజు, నాయకులు కె.అచ్యుతరావు, ఎస్.రత్నకాంత్, శేఖర్, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికులకు సత్కారం



కాంట్రాక్ట్ కార్మికులను సత్కరిస్తున్న విభాగం అధికారులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కోక్‌ఓవెన్స్ బ్యాటరీ–4 కార్మికులను మంగళవారం సత్కరించారు. విభాగంలో జరిగిన కార్యక్రమంలో 80 మంది కాంట్రాక్ట్ కార్మికుల్లో ఎనిమిది మందికి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమానికి హాజరైన బ్యాటరీ–4 ఆపరేషన్స్ ఇన్‌చార్జ్ బి.ఎస్.ఎస్. దుర్గాప్రసాద్ మాట్లాడుతూ కరోనా వల్ల ఇబ్బందులకు గురైన బ్యాటరీ ఓవెన్స్ మరమ్మతు పనుల్లో శాశ్వత ఉద్యోగులతో భాగస్వాములై సేవలు అందించారని కొనియాడారు. ఈ సందర్భంగా నెలాఖరున పదవీ విరమణ చేస్తున్న ఉద్యోగి పి. వెంకటేశ్వరరావును సన్మానించారు. కార్యక్రమంలో మెకానికల్ జీఎం బి.టి. నాయక్, డీజీఎంలు కె. తాతారావు, చంద్రశేఖర్, దుర్గాప్రసాద్, సీనియర్ మేనేజర్లు టి. శ్రీనివాసరావు, నాయక్, వివిధ కార్మిక సంఘాల నాయకులు ఎం. శ్రీనివాస్, ఆర్. సత్యనారాయణ, ఎం.వి. రమణ, వై. అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

PUBLICATION

Under instructions of A.P.G.V.Bank, RASMECCC, Sitammapeta, Visakhapatnam I issue the following public notice: One Smt.Gajala @ Gajala Lakshmi, W/o. (1) Sree Ramulu, D.No.31-30-179, Vadlapudi R.H.Colony, Kurmannapalem approached A.P.G.V. Bank, Natayyapalem Branch for obtaining a housing loan to construct RCC building in the below mentioned schedule property which was purchased by her under Sale Deed dt.10-03-2016 vide Doct.No.696/2016 from Guru Raja Sekhar, S/o. Appa Rao registered before SRO, Pedagantyada, Visakhapatnam. Her vendor purchased the same from Gajjela Sree Ramulu, S/o. (L) Appanna on 05-01-2005 vide Doct.No. 119/2005 registered before SRO, Gajuwaka and the same was lost when it was under her custody and a non-Tracing certificate was submitted by her to that effect. Therefore, the public is hereby informed that if anyone has any objections over the schedule property, please contact the below mentioned address or phone number within seven days from the date of this publication, otherwise the bank will proceed further to sanction the loan against the schedule property. If any objections are raised subsequently will not affect the charges of the bank over the schedule property.

Schedule Property covered by the Sale Deed dt. 05-01-2005, Doct.No.119/2005: Visakhapatnam District, Pedagantyada Sub Registration, Gajuwaka Mandal, Upparavanipalem Village, Vadlapudi R.H.Colony, Vadlapudi, Old S.No.10/1, New S.No.11/2, Plot No.1819, D.No.31-30-179, Asst No.1086309251, 62 sq.yds western part out of 107 sq.yds bounded by: **East :** RCC Building of Kanithi Appala Raju, **South :** Property of Dronadri Atchayyamma, **West :** RCC Building of Gurrala Simhachalam, **North :** Lakshmipuram Colony Road.

B.Yasodhara Vedamani, Advocate
D.No.1-3-130/2, Akkireddypalem, Visakhapatnam-12
Cell: 9246621619, 9248609471